క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

జగిత్యాల: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్ని ఉన్నత శిఖరానికి చేరాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వారిని కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో బాగా చదువుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్ పర్సన్ దావ వసంతలను కలిశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

జగిత్యాల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక తపస్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సీపీఎస్ రద్దు, ఆర్థిక పరమైన అంశాలు, పీఆర్సీ, డీఏలు తప్పక మంజూరు చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల కోసం పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్‌రావుతదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య భద్రత కాంగ్రెస్ లక్ష్యం

జగిత్యాల: వృద్ధాప్య భద్రత కాంగ్రెస్ లక్ష్యమని ఎమ్మెల్సీ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరభవన్‌లో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం కార్యదర్శి శ్రీనివాస్, రమేశ్, సతీశ్, నవీన్, నరేందర్, హరికృష్ణ, వంశీ, శ్రవణ్ పాల్గొన్నారు. అంతకుముందు సీనియర్ సిటిజన్స్ ఎమ్మెల్సీని కలిశారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తానని జీవన్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసిన వాకర్స్ అసోసియేషన్

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య, గౌరవ అధ్యక్షుడు అత్తినేని శంకర్, కుర్ర కృష్ణ, ప్రధాన కార్యదర్శి పరంధాములు, కోశాధికారి ఎంబారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

బుగ్గారం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కళ్యాణి ఈ టెక్నో స్కూల్ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించి మాటాల్డారు. విద్యతోనే సమాజం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంగనభట్ల దినేశ్, పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ రహమాన్,ప్రిన్సిపాల్ దూడ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో అతిపురాతన శివాలయం అభివృద్ధి కోసం వీవీరావుపేట లెజెండ్ యూత్ సభ్యులు సోమవారం రూ.10,116లను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు యూత్ సభ్యులకు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు లెజెండ్ యూత్ సభ్యులు కల్లెడ గంగాధర్, వేముల రాజశేఖర్, పెంబి మహేశ్, గుగ్లావత్ రాజశేఖర్, వేముల చైతన్య పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ధర్మపురి: గాయత్రి బ్యాంకులో ఖాతాదారులుగా ఉండి కనీస డిపాజిట్ చేసి అకాల మరణం పొందిన మృతుడికి కుటుంబాలకు గాయత్రి బ్యాంకు అండగా నిలుస్తుందని బ్యాంకు రీజనల్ హెడ్ బింగి తిరుపతి అన్నారు. బుగ్గారం మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన పుదారి గంగాధర్ ధర్మపురి గాయత్రి బ్యాంకులో నిర్భయ ఖాతాదారులుగా ఉన్నాడు. గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మృతుడి భార్య సంధ్యారాణికి సోమవారం రీజనల్ హెడ్ చేతుల మీదుగా రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వొజ్జల మోహన్ తదితరులున్నారు.

కాల్వ మరమ్మతులపై నిర్లక్ష్యం

‘ఇది మెట్‌పల్లి పట్టణం మీదుగా వెళ్తున్న కాకతీయ కాల్వ. స్థానికంగా జాతీయ రహదారిపై ఉన్న వంతెన వద్ద కాల్వ లైనింగ్‌పై ఇలా దట్టంగా చెట్లు పెరిగి ఉన్నాయి. ఈ ఒక్క చోటనే కాదు.. కాల్వకు ఇరువైపులా ఎక్కడ చూసినా ఏపుగా పెరిగిన చెట్లే కనిపిస్తాయి. గతంలో తరచుగా చెట్లను తొలగించే ప్రక్రియ చేపట్టిన అధికారులు..దశాబ్దకాలంగా దానిని నిలిపేశారు. దీంతో ఇరువైపులా అడుగడుగునా కాల్వను చెట్లు కమ్మేశాయి. దీంతో ఇప్పటికే కొన్ని చోట్ల కాల్వపై ఉన్న సిమెంట్ దెబ్బతింది. అధికారుల నిర్లక్ష్యంతో రాబోయే రోజుల్లో పూర్తిగా దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి.’



- ఇరువైపులా కమ్మేసిన దట్టమైన చెట్లు
- దెబ్బతింటున్న సిమెంట్ లైనింగ్
- మరమ్మతుల కోసం నిధులు కరువు

మెట్‌పల్లి: ఎస్సారెస్పీ కాకతీయ కాల్వ పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 284 కిలోమీటర్ల మేర విస్తరించిన ఉన్న ఈ కాల్వ సుమారు 4.70 లక్షల ఎకరాలకు సాగు, ప్రధాన పట్టణాల్లో తాగు నీటి అవసరాలకు దోహదపడుతోంది. జగిత్యాల జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల ఆయకట్టు దీని కింద సాగవుతోంది. మరోవైపు వేసవిలో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాల్లో నీటి కొరతను అధిగమించడానికి కాల్వ నీటిని వినియోగిస్తున్నారు. అయితే కాల్వ పరిరక్షణలో అవసరమైన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో తరచుగా ఇన్స్‌పెక్షన్ రోడ్డుకు మరమ్మతులు చేయడం, జంగిల్ కటింగ్ పేరుతో చెట్లు తొలగించడం వంటి చర్యలు చేపట్టడం జరిగేది. కానీ దశాబ్దకాలంగా వీటిని నిలిపివేశారు. దీంతో కాల్వ లైనింగ్ ఇరువైపులా



ఇరువైపులా చెట్లతో నిండిపోయిన కాల్వ

దట్టమైన చెట్లతో నిండిపోయింది. అలాగే చాలా చోట్ల ఇన్స్‌పెక్షన్ రోడ్డు కూడా దెబ్బతింది.

నిధుల కేటాయింపు అంతంతే..

ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు లేకపోవడంతో అధికారులు మరమ్మతులు చేపట్టలేకపోతున్నారని తెలిసింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి రాష్ట్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతుల కోసం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసింది. అయితే ఆ పనుల్లో భారీగా అక్రమాలు జరగడంతో ప్రభుత్వం విచారణ చేపట్టి పలువురు అధికారులను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత నుంచి ఎస్సారెస్పీకిపెద్దగా నిధులను కేటాయించ లేదు. అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ ఆ మేరకు నిధులు రావడం లేదని సమాచారం.

కాల్వ లైనింగ్‌పై ప్రభావం..

కాల్వకు ఇరువైపులా ఉన్న దట్టమైన చెట్ల ప్రభావం సిమెంట్ లైనింగ్‌పై పడుతోంది. ఇప్పటికే దీనివల్ల పలు చోట్ల సిమెంట్ దెబ్బతింది. ఇలాగే నిర్లక్ష్యం చూపితే రాబోయే రోజుల్లో లైనింగ్ పూర్తిగా దెబ్బతినే అవకాశముంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాల్వ పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈజీఎస్ సిబ్బంది ముందుకు రావడం లేదు

కాల్వకు ఇరువైపులా ఉన్న చెట్లను ఉపాధి హామీలో తొలగించాలని ఉన్నతాధికారులు సూచించారు. కానీ అనుకూలంగా లేదని వారు ముందుకు రావడం లేదు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.
– దేవానంద్, డీఈ

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

జగిత్యాలరూరల్: నూతన సంవత్సర వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున్న నూతన సంవత్సర వేడుకల్లో కేక్‌లు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. సోమవారం ఉదయం పొలాస పొలాస్తేశ్వర స్వామి ఆలయంలో, సహస్ర వెయ్యి లింగాల ఆలయం, పొరండ్ల రామలింగేశ్వరస్వామి ఆలయం , చిన్నగట్టు ఆంజనేయస్వామి ఆలయం, లక్ష్మీపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు.

జగిత్యాల: పట్టణంలోని ఆనంద నిలయంలో కళాశ్రీ ఆర్ట్స్ అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కొత్త సంవత్సరంలో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు.

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి యువకులు, మహిళలు కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై అజయ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

పెగడపల్లి: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయాన్నే వాకిల్లలో రంగు రంగుల ముగ్గులు వేశారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. క్రైస్తవులు చర్చిల్లో కేక్‌కట్ చేశారు. నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరాలని ఆకాంక్షించారు.





జగిత్యాల,ధర్మపురిలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో సోమవారం 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించారు. యువత ప్రత్యేకంగా వాడల్లో కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాల్లో మునిగిపోయారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాలలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, విద్యార్థులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఉత్సవాలు అంబరాన్నంటాయి. ముఖ్యంగా మల్లాపూర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ధర్మపురి: ధర్మపురితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భగా ఇంటి ముంగిళ్లలో రంగు రంగుల ముగ్గులతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక పట్టణంలోని పలు చోట్ల కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర



కొడిమ్యాలలో అయోధ్య అక్షింతలు శోభాయాత్రగా తీసుకెళ్తున్న భక్తులు

కథలాపూర్: అయోధ్య నుంచి శ్రీరాములవారి అక్షింతలు సోమవారం మండంలోని ఇప్పపెల్లికి చేరాయి. ప్రత్యేక పూజలు చేసిన భక్తులు అక్షింతలతో గ్రామంలోని ప్రధానవీధుల గుండా ఊరేగించారు. సర్పంచ్ కోలి వసంత, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, నరేశ్‌చారి, అజయ్‌రావు, నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని కట్కాపూర్, తాట్లవాయి, వీరాపూర్, ఇటిక్యాల గ్రామాలకు అయోధ్య రాముల వారి అక్షింతలు చేరాయి. ఈ సందర్భంగా అక్షింతలను ఆయా గ్రామాల్లోని ఆలయాల నుంచి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతల పంపిణీ

పెగడపల్లి: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య రామాలయంలో పూజలు అందుకున్న అక్షింతలు పెగడపల్లికి చేరుకున్నాయి. స్థానిక రాజరాజేశ్వర ఆలయంలో మొదటగా పూజలు చేసి అనంతరం సోమవారం రామభక్తులు ఇంటింటా పర్యటించి అక్షింతలు, కలశాలు, కరపత్రాలు, చిత్రపటాలు, రామనాప జపంతో పారాయణం చేస్తూ ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టు: అయోధ్య నుంచి వచ్చిన రాముని అక్షింతలు కొడిమ్యాల మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా అక్షింతలతో ఘనంగా శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు.



ఇప్పపెల్లిలో అక్షింతలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

మల్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు అంగరంగా వైభవంగా నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు మేళ,తాళాల మధ్య, సాంప్రదాయ దుస్తుల్లో రామయ్య అక్షింతల ఊరేగింపులో పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కట్లకుంటకు అయోధ్య రామయ్య అక్షింతలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీ సీతా రామాంజనేయ ఆలయ సభ్యులు ఆధ్వర్యంలో గ్రామంలో పంపిణీ చేశారు.

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్‌లో సోమవారం శ్రీ బాల రామ చంద్రుని అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల అంజయ్య,గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్: అయోధ్య రామమందిర రాముని అక్షింతలు సోమవారం మండలంలోని కుస్తాపూర్ గ్రామానికి చేరుకున్నాయి. స్థానిక శివాలయంలో అయోధ్య రాముని అక్షింతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతో గ్రామంలో ఊరేగించారు.


విద్యార్థి చదువుకు ఆర్థికసాయం

ధర్మపురి: మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన మంత్రి అంజలికి శాతవాహన విశ్వ విద్యాలయంలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సీటు వచ్చింది. ప్రతీ ఏడాది రూ.40 వేల ఫీజు చెల్లించాల్సి ఉంది. నిరుపేద కుటుంబమైన అంజలి చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. విషయం తెలిసిన ధర్మపురికి చెందిన వై టీమ్ కన్వీనర్ (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) గొల్లపెల్లి గణేశ్ ఆధ్వర్యంలో వై టీమ్, ఇతర దాతల సహకారంతో రూ.40 వేలు జమ చేసి సోమవారం విద్యార్థినికి అందజేశారు. పేద విద్యార్థి చదువులకు అయ్యే ఖర్చు భరిస్తామని తెలుపడంపై తల్లిదండ్రులు, పలువురు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో వై టీమ్ సభ్యులు పెండ్యాల సంజీవ్, వంశీకృష్ణ, ఉపాధ్యాయురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో ప్రజాపాలన

పెగడపల్లి: మండలంలోని నామాపూర్, వెంగళాయిపేట, రాజరాంపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. అభయహస్తం ఆరు గ్యారంటీల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి మిత్రుల సాయం



బుగ్గారం: అనారోగ్యంతో మంచానికే పరిమితమైన మిత్రుడి కుటుంబానికి వారి మిత్రులు చేయూతనిచ్చి తోడుగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన కప్పల సంతోష్ అనే యువకుడు దివ్యాంగుడు . అయినా ఏమాత్రం అధైర్యపడకుండా కష్టపడి చదివి ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో చేరాడు.చదువు పూర్తి చేసి ఏదైనా ఉద్యోగం సంపాదించి తన కుటుంబానికి ఆసరాగా నిలవాలనుకున్నాడు.ఈ క్రమంలో ఆరేళ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి మంచానికే పరిమితం అయ్యాడు. సంతోష్ తండ్రి పోషన్నకు ఇటీవల అనారోగ్యానికి గురై కుటుంబ పోషణ కష్టమైంది. వీరి దీన పరిస్థితిని తెలుసుకున్న సంతోశ్ మిత్ర బృందం తలా కొంత డబ్బును సమకూర్చి రూ.35 వేలు బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరింత మంది సహృదయులు ముందుకు వచ్చి వీరి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న విప్, చిత్రంలో ఎమ్మెల్సీ, కలెక్టర్

పెగడపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పరిష్కరిస్తామని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బతికపల్లిలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ యాస్మిన్ బాషాతో కలిసి ప్రారంభించారు. సంక్షేమ ఫలాలు అందుకోవడం ప్రజల హక్కు అని, అర్హులందరికీ ఫలాలు అందిస్తామని అడ్లూరి స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులను ఎవరూ కొనుగోలు చేయొద్దని, అందరికీ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. బతికపల్లిని మండలంగా ఏర్పాటుచేయాలని సర్పంచ్ శోభారాణి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కోరారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, ఎంపీటీసీలు లచ్చయ్య, అనసూర్య, డీపీవో దేవరాజ్, పీఆర్ ఈఈ రహమాన్, ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఎంఏ.ఫరూక్, ఎంపీవో మహేందర్ పాల్గొన్నారు.

ఘనంగా లోక బాపురెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కథలాపూర్: మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్‌లు కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా బాపురెడ్డి రైతులకు అందించిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు గడ్డం శేఖర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్, బద్దం మహేందర్‌రెడ్డి, పూండ్ర జనార్దన్‌రెడ్డి, ప్రిన్స్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, గుండారపు గంగాధర్, దేవారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం సామూహిక అయ్యప్ప దీక్ష స్వాముల ఆధ్వర్యంలో సామూహిక మహా పడిపూజ వైభంగా జరిగింది. అంతకు ముందు గ్రామంలో శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. అనంతరం స్వాములకు భిక్ష, భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, ఆలయ చైర్మన్ దాసరి తిరుపతి, గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులుపాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయ కల్యాణ మండపంలో సోమవారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన



కోరుట్ల: పట్టణ శివారులోని అయ్యప్ప ఆలయంలో సోమవారం స్వామివారికి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు,అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప దీక్షాపరులు, గురు స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప ఆలయ 7వ వార్షికోత్సవం గురుస్వామి మిట్టపల్లి లక్ష్మీనారాయణ, గురుస్వామి పాలెపు కొండలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం అయ్యప్పదీక్షాపరులు పడిపూజ నిర్వహించారు.

వైభవంగా రంగనాథుల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి హరిహర ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రంగనాథుల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవమూర్తులకు కల్యాణం చేశారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో వేద పండితులు సూర్యనారాయణశర్మ, విష్ణుశర్మ, అనంతచార్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మల్యాల: మండలంలోని లంబాడిపల్లిలోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చి, వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

ఉమామహేశ్వరస్వామి ఆలయంలో..

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బద్దం శ్రీనివాస్‌రెడ్డి–వనిత దంపతులు అందించిన విరాళంతో భక్తులకు అన్నదానం చేశారు.

నియామకం

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లింబాద్రి



మెట్‌పల్లి: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన పుప్పాల లింబాద్రిని నియమించారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయనను ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఉత్తర తెలంగాణ పార్లమెంట్ నియోజకవర్గాల కమిటీలో కూడా లింబాద్రికి సభ్యుడిగా అవకాశం కల్పించారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా లక్ష్మీనారాయణ



కోరుట్ల: పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు కస్తూరి లక్ష్మీ నారాయణను జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు సోమవారం కోరుట్లలో నియామక పత్రాన్ని కస్తూరి లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, నాయకులు చిరుమల్ల ధనుంజయ్, రుద్ర శ్రీనివాస్, జక్కుల జగదీశ్వర్, ఆకుల రంజిత్, గిన్నెల అశోక్, పాల్గొన్నారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా మాదం సతీశ్

రాయికల్: మండలంలోని కట్కాపూర్ శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదం సతీశ్, ఉపాధ్యక్షుడిగా అమ్ముల రాజేందర్, కోశాధికారిగా కాశవేని రాజేందర్, సలహాదారులుగా రామస్వామి, కార్యవర్గ సభ్యులుగా కొమురయ్య, మహేశ్, రాజు సోమవారం ఎన్నికయ్యారు.

ఆదర్శ రైతు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామ ఉత్తరవాడ ఆదర్శ రైతు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేతి సత్యనారాయణ రెడ్డి,ఉపాధ్యక్షుడిగా కొల్ల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొల్ల నారాయణ,కోశాధికారిగా రఘుపతి, సహాయ కార్యదర్శిగా కొయ్యడి మహిపాల్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.